

కేజీ పీజీ సెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- కడప అర్బన్

కందుల విద్యా సంస్థలు ఇటీవల నిర్వహించిన కేజీ పీజీ సెట్ 2024 ఫలితాలను కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ కె. రాజేశ్వరి విడుదల చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్ష నిర్వహించడం ఇది రెండో సారి అన్నారు. 169 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరు అయ్యారని, వీరిలో 152 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. మొదటి ర్యాంకు సాధించిన వారికి తమ కళాశాలల్లో ఉచిత విద్యతో పాటు వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కె.మదన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నాగేశ్వర ప్రసాద్, కెఎస్ఎం ప్రిన్సిపల్ డాక్టర్ నాగమణి, కెఎల్ ఎం మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అడుగంటిన ప్రాజెక్టులు



జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ అడుగంటిపోయాయి. గండికోట మొదలుకుని ఝరికోన వరకు జలాశయాలన్నీ తాగునీటి అవసరాలు తీర్చ డానికి పరిమితమవుతున్నాయి. వీటిని సాగునీటి అవసరాలకు ఉద్దేశించి నిర్మించారు. కానీ ఆచరణలో తాగునీటి అవసరాలకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత వేసవిలో తాగునీటికి కటకటే ఎదురవు తోంది. ఇప్పటికే కడప, బద్వేల్ వంటి పట్టణాల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే.

- ◆ డెడ్‌స్టోరేజీ దిశగా జలాశయాలు
- ◆ తాగునీటికీ..కటకట

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని గండికోట, బ్రహ్మంసాగర్, మైలవరం, పైడిపాలెం, సర్వరాయసాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, అన్నమయ్య, వెలిగల్లు, చిత్రావతి, లోయర్ సగిలేరు, దిగువ సగిలేరు, బుగ్గవంక ప్రాజెక్టుల్లో 82.258 టిఎంసిలు నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వర్షాలు లేకపోవడంతో 17.4044 టిఎంసిలకు చేరుకుని డెడ్‌స్టోరేజీ దిశగా పరుగులు తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. పైగా ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను సక్రమంగా మెయింటె నెన్స్ చేయకపోవడంతో ప్రమాదకర సంకేతాలను ఇస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

గండికోట ప్రాజెక్టు

గండికోట ప్రాజెక్టు 26.850 టిఎంసిల సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 2.806 టిఎంసిలు మాత్రమే నీరు నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుంచి సుమారు 106 కిలోమీటర్ల మేరకు గాలేరు-నగరి ఫేజ్-2 దశలోని పనులు పూర్తి చేయాల్సి ఉంది. వైసిపి సర్కారు హయా ంలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడంతో గతేడాది నుంచి సాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆదుకున్న సంగతి తెలిసిందే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నైరుతి రుతు పవనాలు అనుకూలిస్తే సాగు, తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంటుంది..

మైలవరం రిజర్వాయర్

మైలవరం 9.960 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. ప్రస్తుతం 0.501 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంటోంది. దీన్ని ఎక్కువగా సాగు నీటి అవసరాల నిమిత్తం ఏర్పాటు చేశారు. దీనికి లోపలి వైపున సప్లయ్ కెనాల్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రస్తుతం మైలవరం రిజర్వాయర్ తాగునీటి అవసరాలను తీర్చడానికి పరిమితమైంది.



మైలవరం ప్రాజెక్టు

చిత్రావతి రిజర్వాయర్

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 10.229 టిఎంసిల సామ ర్థ్యంతో నిర్మితమైంది. ప్రస్తుతం 4.030 టిఎంసిల నిల్వను కలిగి ఉంది. డెడ్‌స్టోరేజీ దిశగా పరుగులు తీస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అందించ లేని దుస్థితికి చేరుకుంది.

బ్రహ్మంసాగర్ రిజర్వాయర్

బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ 17.73 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. 2.329 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ కింద సుమారు 1.50 లక్షల పైచిలుకు ఆయకట్టు ఉంది. తెలుగు గంగ కాలువలో పూడికతీత పనులను అసంపూర్తిగా చేయడంతో శ్రీశైలం నుంచి విడుదలైన నీరు కాలువల లీకేజీల మయమైంది. దీంతో విడుదల చేసిన సాగునీరు పూర్తి స్థాయిలో రిజర్వాయర్‌ను చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

సబ్సిడీ రిజర్వాయర్-1

తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన సబ్సిడీ రిజర్వాయర్-1, 2. 134 టిఎంసీల సామర్థ్యంతో నీటి నిల్వను కలిగి ఉంది. ప్రస్తుతం 0. 185 టిఎంసిల నిల్వ నీటిని కలిగి ఉంది. దీంతో తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితమవుతోంది.

సబ్సిడీ రిజర్వాయర్-11

తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన సబ్సిడీ రిజర్వాయర్-11 1.447 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. ప్రస్తుతం 0.149 టిఎంసిల నీటి నిల్వలను కలిగి ఉంది.

వెలిగల్లు ప్రాజెక్టు

వెలిగల్లు ప్రాజెక్టు 4.64 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 1.154 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. దీని కింద 24 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం వెలిగల్లు ప్రాజెక్టు రాయచోటి పట్టణవా సుల తాగునీటి సమస్యను తీరుస్తోంది. ప్రాజెక్టు నిర్మించిన పదేళ్లలో ఒకసారి కూడా నిండిన అవకాశాలు లేవని తెలుస్తోంది.

వామికొండ

వామికొండ రిజర్వాయర్ 1.658 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మి తమైంది. ప్రస్తుతం 0.571 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీని కింద 20 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు అసంపూర్తి నిర్మా ణంతో సాగు నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేయలేని దుస్థితి దాపురించింది.

సర్వరాయసాగర్ :

సర్వరాయసాగర్ రిజర్వాయర్ 3.060 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. ప్రస్తుతం 0.474 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీని కింద 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో అరకొర నీటి నిల్వలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

పైడిపాలెం :

పైడిపాలెం రిజర్వాయర్ ఆరు టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. ప్రస్తుతం 3.893 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 50 శాతం నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉండడం స్వల్ప ఊరట కలిగించడం మినహా ఎటువంటి ప్రయోజనమూ లేదు.

బుగ్గవంకప్రాజెక్టు :

బుగ్గవంక ప్రాజెక్టు 0.506 టిఎంసిల నీటి సామర్థ్యాన్ని కలిగి ఉం ది. ప్రస్తుతం 0.051 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితమైనట్లు తెలుస్తోంది.

లోయర్ సగిలేరు ప్రాజెక్టు :

తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా లోయర్‌సగిలేరు ప్రాజె క్టు నిర్మితమైంది. 0.169 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మి తమైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో చుక్కనీరు లేకపో వడం గమనార్హం. దీని పరిధిలో 13 వేల ఎకరాల ఆయకట్టు సాగయ్యే అవకాశం ఉంది.



వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు



వెలిగల్లు ప్రాజెక్టు



జెవివి నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ గేయానంద్

ఆలోచనాశక్తిని పెంచేందుకు కృషి

జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

సమాజంలో ఆలోచనాశక్తిని పెంపొం దించేందుకు జనవిజ్ఞానవేదిక (జెవివి) కృషి చేస్తుందని జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అన్నారు. జెవివి నూతన కార్యా లయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్, ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయడానికి సమిష్టి కృషితో జెవివి ప్రయత్నిస్తోందన్నారు. సజీవ లక్షణమే సైన్స్ ప్రత్యేకత అన్నారు. అందుకే జెవివి తన గీటురాయిగా సైన్స్‌ను అనుసరిస్తుందని చెప్పారు. జెవివి సభ్యులు, నాయకుల బాధ్యతలను వివరించారు. చెకుముకి ఒక ప్రత్యేక విభాగాన్ని అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సైన్స్ ఉపాధ్యాయలకు శిక్షణ, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా జెవివి కార్యకర్తల నాయకత్వ శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఓబులరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ శాస్త్రీయ ఆలోచనను కలిగి ఉండాలన్నారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలను వాటి మౌలిక స్వరూపాల గురించి అధ్యయనం చేయాలన్నారు. జెవివి వ్యవస్థాపక నాయకులు డాక్టర్ నరసింహారెడ్డి, రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోలంకి శ్రీరాములు, బాలబయన్న, సరస్వతి, జిల్లా నాయకులు మురళీగుప్త, రాజేష్, శివరాం, సునీత, డాక్టర్ రామమునిరెడ్డి, డాక్టర్ వరుణ్, డాక్టర్ శివారెడ్డి, రాజశేఖర్, కిరణ్, డాక్టర్ మురికూటి సూర్యనారాయణరెడ్డి, చక్రధర్, కో-ఆర్డినేటర్లు అక్షయ, భరత్, తేజ, యోచిత, వెంకట్‌భరత్, వైద్యులు, మేధావులు, ప్రజలు పాల్గొన్నారు.

బతుకు చిత్రణే నదీ సాహిత్యం

సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి



మాట్లాడుతున్న చింతకుంట శివారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నది పరీవాహక ప్రాంతాల భౌగోళిక, సాంస్కృతిక, సాంఘిక, ఆర్థికాంశాలతో కూడుకున్న మనిషి బతుకు చిత్రణే నదీ సాహిత్యమని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 132వ సదస్సు నిర్వహించారు. 'రాయలసీమ నదీ సాహిత్యం' (మొదటి ప్రసంగం) అనే అంశంపై సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట', పి.రామకృష్ణారెడ్డి 'పెన్నేటి కతలు' అనే రచనల్లోని నదీ సాహిత్యాన్ని విశ్లేషించారు. పెన్నేటి పాట చిన్నకావ్యమైనప్పటికీ ప్రాంతీయ అస్తిత్వం దిశగా తెలుగు సాహిత్యంలో చైతన్యం నింపిందన్నారు. ఈ అస్తిత్వ స్పృహ తర్వాతి రచయితలకు స్ఫూర్తిదాయకమైందన్నారు. రాయలసీమ రైతు కన్నీటిగాథను కరుణ రసాత్మకంగా విశ్వం చిత్రించారన్నారు. పెన్నానది ప్రవహించినప్పుడు ఆనందాన్ని, ఎండినప్పుడు దు:ఖాన్ని మిగిల్చిన జ్ఞాపకాలకు అక్షరరూపాన్ని ఇస్తూ ప్రాంతీయ భాషకు పట్టం గట్టారన్నారు. పెన్నేటి కతలు వెలువరించిన రామకృష్ణారెడ్డి పోట్లదుర్తి దగ్గర పెన్నానది ఒడ్డున ఉన్న హనుమనగుత్తి గ్రామానికి చెందినవారని తెలిపారు. ఆ ఊరి పరిసర ప్రాంత జనజీవనానికి అద్దం పట్టేలా కథలను రాయలసీమ మాండలికంలో రాశారన్నారు. వ్యవసాయం తీరు తెన్నులు, రైతులు కూలీలుగా మారి వలస పోవడం, అనావృష్టితో ఒకసారి, అతివృష్టితో మరోసారి పంట నష్టపోవడం, పశువులకు, రైతులకు మధ్య ఆత్మీయ అనుబంధాన్ని ఆయన తన కథల్లో చిత్రించారన్నారు. అడవి పావురేను, జీరంగి, బట్టకోడె, దేవర దున్నపోతు, ఎనుములు, జీవాలతో మనిషి జీవితం ఏవిధంగా ముడిపడి ఉంటుందో రామకృష్ణారెడ్డి తన కథల్లో వివరించారన్నారు. వీరి రచనలతోపాటు పాలగిరి విశ్వప్రసాద రెడ్డి 'చుక్క పొడిచింది', శాంతి నారాయణ 'పెన్నేటి మలుపులు', డాక్టర్ వేంపల్లి గంగాధర్ 'పాపాగ్ని కథలు', బత్తుల ప్రసాద్ 'సగిలేటి కథలు' లాంటి మరికొన్ని రచనలను పెన్నానదీ సాహిత్యంలో అంతర్భాగంగా చెప్పవచ్చన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ చింతకుంట శివారెడ్డిని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, సాహితీవేత్తలు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, గానుగపెంట హనుమంతరావు, పుత్తా పుల్లారెడ్డి, కొత్తపల్లి రామాంజనేయులు, రాజారెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ సాయిప్రసాద్, చంద్రశేఖర రెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, నారాయణ రెడ్డి, బాలరాజేశ్వర రెడ్డి, బాలయల్లారెడ్డి, స్వరూపరాణి, రామమోహన్ రెడ్డి, రెడ్డయ్య, గంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

విద్యకు మించిన ఆస్తి మరొకటి లేదు

మహారాష్ట్ర ఐపిఎస్ అధికారి మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-గోపవరం

విద్యకు మించిన ఆస్తి మరొకటి లేదని మహారాష్ట్రకు చెందిన ఐపిఎస్ అధికారి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బద్వేల్ పట్టణంలోని సూర్య నెక్ట్స్ జనరేషన్ నూతన పాఠశాలను వైఎస్ఆర్ జిల్లా ఎఎస్‌పి వెంక ట్‌రాముడు, పాఠశాల చైర్మన్ చెన్నుపల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ భోగేంద్రనాథ్‌రెడ్డి, వ్యవసాయ సంచా లకులు డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐపిఎస్ అధికారి మాట్లాడుతూ నాణ్యమైన విద్యా బోధనకు అధునాతనమైన వసతులతో కూడిన తరగతి గదులు, అనుభవమున్న మంచి ఉపా ధ్యాయులు, వసతులు పాఠశాలలో కల్పించడం శు భపరిణామమని చెప్పారు. ప్రస్తుత వ్యవసాయ సహాయ సంచాలకులుడ్డి మాట్లాడుతూ సమాజ పురోగతి చెందాలన్నా, సమాజంలో కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలన్నా విద్యార్థులకు చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని అటు వంటి నాణ్యమైన విద్యా బోధన అందిం చడానికి సూర్య నెక్ట్స్ జనరేషన్ పేరుతో ఒక ఆదర్శ వంతమైన పాఠశాలను బద్వేలు పట్టణంలో ఏర్పా టు చేయడం ఒక మంచి శుభ పరిణామం చెప్పా రు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ పాఠశాల చైర్మన్ మాటా ్లడుతూ బద్వేల్ పట్టణంలో ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అంది ంచడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి.రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు గంగసాని సాం బశివరెడ్డి, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ సుందర్ రామి రెడ్డి, ఆర్య వైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి. సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారి చెన్న య్య, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాల ప్రారంభోత్సవంలో అతిథులు

జూన్ 23న 'తొగట' విద్యార్థుల ప్రతిభకు పట్టాభిషేకం

ప్రజాశక్తి-కడప సిటీ

2023 -2024 సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన తొగట వీర క్షత్రియ విద్యార్థిని విద్యార్థులకు జూన్ 23న 'పట్టాభిషేకం' పేరిట ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కల్యా సుధాకర్, కోశాధికారి టేకూరి సుదర్శన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, గౌరవ అధ్యక్షులు సుంకర రామచంద్రుడు, కార్యనిర్వహ కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ్య, ఉపాధ్యక్షులు చౌడం సూర్యనారాయణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి వారిలో నూతనోత్సహాన్ని కల్పించి తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 520 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. నగదు పురస్కారం, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కడప నగరంలో ప్రయివేట్ పాఠశాలలో చదివి 500 పైబడి మార్కులు వచ్చిన విద్యా ర్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. జూన్ 23న ఆదివారం ఉదయం 10 గంటలకు కడపలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలను అందజేస్తామని పేర్కొన్నారు. టెన్త్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను జూన్ 9 లోపు కల్యా సుధాకర్ డోర్ నెంబర్ 1/1376 శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం ఎదురుగా బియ్యం అంగడి ఎర్రముక్కపల్లి కడప చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94416 36143, 9490099510, 9985923449లలో సంప్రదించాలన్నారు.

ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి

కడప : కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని కాల్ టెక్స్ కుటుంబ సభ్యులు ప్రార్థనలు చేశారు. రహమతుల్లా వీధుల్లో వెలిసి ఉన్న హజరత్ ఖాజా బందే నవాజ్ చాంద్ పిరిగుమ్మద్ ఉరుసు ఉత్సవాలు భాగంగా కాల్ టెక్స్ కుటుంబ సభ్యులు హబీబుల్లా హాఫీజ్ ఉల్లా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కుష్టి రుటీ వద్దా ఫాతేహా చేసి ప్రసాదాలు భక్తులకు ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇనాయతుల్లా మాజీ కౌన్సిలర్ హాజీ నగర ప్రముఖులు ఆర్కేరాయల్ అబ్దుల్ కరీముల్లా మక్బూల్ బాషా పాల్గొన్నారు.

క్రికెట్‌లో రాణిస్తే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - కడప



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

క్రికెట్ లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్ అన్నారు. ఆదివారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో అండర్ -16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి జట్టుకు ఎంపిక కావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే మ్యాచ్‌లలో కూడా మంచి ప్రతిభ కనబరిస్తే ఉన్నత స్థాయికి చేరుకో గల అవకాశాలు ఉన్నాయని చెప్పారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ -16 ఎంపికలకు జిల్లా నుండి దాదాపు 150 మంది పైగా క్రికెటర్లు పాల్గొనడంతో విశేష స్పందన లభించింది. ఎంపికల్లో పాల్గొన్న 150 మంది క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచిన 60 మందిని ప్రాబబుల్స్ గా ఎంపిక చేసినట్లు ఈ సందర్భంగా రెడ్డి ప్రసాద్ చెప్పారు. త్వరలో ప్రాబబుల్ మ్యాచ్‌లు నిర్వహించి అందులో మంచి ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎం. సాయి పృద్వి తేజ్, సెలెక్టర్లు వై. శివప్రసాద్, అబ్దుల్ రహమాన్ ఫరూక్, కె. విష్ణు మోహన్ రావు, శ్రీకాంత్ రెడ్డి, సాయి ఈశ్వర్ రెడ్డి, జగదీష్ కుమార్, భరద్వాజ్, సలీం బేగ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మూల్యాంకనంపై ఆన్‌లైన్ శిక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఎగ్జామినేషన్స్ ఆన్లైన్ మూల్యాంకనం పైన అవగాహన సదస్సు ఆదివారం కడప జిల్లాలో మూడు చోట్ల నిర్వహించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కడప, దీప్తి జూనియర్ కాలేజ్ ప్రొద్దుటూరు, ప్రభుత్వ జూనియర్ కళాశాల పులివెందులలో మూల్యాంకనం ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. కడప ట్రైనింగ్ సెంటర్‌లో 250, ప్రొద్దుటూరు లో 150, పులివెందుల 150 మంది హాజరయ్యారు. వైఎస్ఆర్ జిల్లాలో 500 పైన హాజరయ్యారు. వీరందరికీ ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ మూల్యాంకనం ఏ విధంగా చేయాలి, మార్క్స్ ఏ విధంగా పోస్ట్ చేయాలి అనే వాటి పైన పూర్తిస్థాయిలో ఇంటర్మీడియట్ బోర్డ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుబ్బారావు ఆన్‌లైన్‌శిక్షణ ఇచ్చారు.


టపాసులు విక్రయదారులతో మాట్లాడుతున్న సిఐ శంకర్‌రెడ్డి

టపాసులు విక్రయించరాదు : సిఐ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలో జూన్ 6వ తేదీ వరకు ఎలాంటి బాణాసంచా అమ్మకూడదని సిఐ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సిఐ బాణాసంచా అమ్మే వారితో సమావేశం నిర్వహించారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఇదివరకే నోటీసులు కూడా ఇచ్చామన్నారు.

మహాభారతంపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రిష్టారెడ్డి విద్యార్థులకు మహాభారతం అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ.. జూన్ 7 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఆటలు, పాటలు, పుస్తక పఠనం అలవాటు చేస్తున్నామన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు ఉన్నాయన్నారు.

మానవత విలువలు పెంపొందించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సమాజంలో మానవత విలువలు పెంపొందించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. పులివెందుల పెన్షనర్ల భవనంలో ఆదివారం మానవత సంస్థ కన్వీనర్ బివి కృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఎంఇఒ శంభురెడ్డి, అధ్యక్షులు బివి కృష్ణారెడ్డి, జిల్లా కౌన్సిలర్ వై.శ్రీనివాసరెడ్డి, జాయింటు సెక్రటరి బి.శివరామిరెడ్డి, కార్యదర్శి జి.చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, హాజరయ్యారు. ఆసందర్భంగా వారు మాట్లాడుతూ మానవత సేవా సంస్థ ఒక వైపు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే మరో వైపు యువతలో మానవత విలువలను పెంపొందించాలని సూచించారు. మానవత ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని చర్చించారు. మానవత మాజీ అధ్యక్షులు వి.రాఘవరెడ్డి సభ్యులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు ఇటీవల మరణించిన మానవత వెంచెన ఎల్.సిద్దారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

'మానవత' ద్వారా మరింత సేవ

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు మరింతగా ఎక్కువగా చేయడమని పారిశ్రామిక వేత్త బిల్ట్ అధికారి మధు తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మానవత సేవా సంస్థ మాసాంతర సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మధు మాట్లాడుతూ నేటి సమాజంలో ఎంతోమంది నిస్సహాయ స్థితిలో ఉన్నారని తెలిపారు. అనాథలకు మానవత సేవా సంస్థ అండగా నిలుస్తుందన్నారు. అనాథలు ఆదుకోవడంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని కోరారు. భావితరాలకు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు చల్లా బాలాజీ, డైరెక్టర్లు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, అనిల్‌కుమార్ రెడ్డి, కోశాధికారి శ్రావణ్‌కుమార్, సభ్యులు గంగయ్య, చలపతి, డాక్టర్ అరుణ్, గోపి, వెంకటేష్, రామయ్య, వెంకటరమణ, రామ, శివ, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకే అందాలని, ఆ మేరకు మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (యంపిజె) ప్రభుత్వంపై వత్తిడి తెస్తుందని యంపిజె రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. స్థానిక యంపిజె కార్యాలయంలో యంపిజె జిల్లా కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికైన ప్రభుత్వాలు శక్తినంతటిని తమ వద్దే కేంద్రీకరించుకొని నియంతృత్వ పోకడలతో ప్రజలపై మోయలేని భారాన్ని వేయడం తగదని అన్నారు. కులం, మతం, మెజార్టీ, మైనార్టీలుగా సమాజాన్ని విభజించి కలుషితం చేసి విభజించి పాలించడం రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడవడమే అన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. పౌరుల హక్కుల కల్పనలో వారిలో చైతన్యం కలిగించేలా ఎంపిజె కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, ఆహారభద్రత, మానవ హక్కులు, సంపూర్ణ మధ్యనిషేధం, స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ప్రజల మార్పుతోనే దేశం, రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు యంపిజె కార్యకర్తలు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. యంపిజె సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ షేక్ అబ్దుల్ ఖదీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీంబాషా ప్రసంగించారు. కార్యక్రమంలో యంపిజె జిల్లా అధ్యక్షులు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు షేక్ హుశేన్‌బాషా, కార్యదర్శి షేక్ అస్లాంబాషా, కోశాధికారి షేక్ ఇస్మాయిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే సుధీర్‌రెడ్డి అల్లర్లు సృష్టించారు

- జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి వివేక్ బాబు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జమ్మలమడుగు వైసిపి అభ్యర్థి సుధీర్‌రెడ్డి ఓటమి భయంతోనే అల్లర్లు సృష్టించారని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి వివేక్ బాబు పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో వివేక్ బాబు, ఎర్రగుంట్ల మండల జనసేన కో-ఆర్డినేటర్ జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేక్ బాబు మాట్లాడుతూ సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గాన్ని తన ఇలాఖాగా భావించి తన చెప్పుచేతుల్లో పెట్టుకోవడానికి ఏ రకమైన చర్యలకు పాల్పడ్డారో రాష్ట్ర ప్రజలందరూ చూశారని అన్నారు. జమ్మలమడుగు పట్టణం, పెదనపాడు గ్రామంలో ఓటర్లను భయ భ్రాంతులకు గురిచేసి రిగ్గింగ్‌కు పాల్పడేలా అల్లర్లు రేకెత్తించారని ఆరోపించారు. ప్రజలంతా కూటమి వైపే ఉన్నారని, ఓటమి భయంతో వైసిపి నాయకులు గొడవలు చేశారని తెలిపారు. రిగ్గింగ్‌కు పాల్పడేలా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ ఆపాలంటూ లైన్మెన్లను, ఎఇలను సుధీర్‌రెడ్డి బెదిరించారని ఆరోపించారు.

ప్రేక్షకులను అలరించిన నృత్య ప్రదర్శనలు

పులివెందుల టౌన్ : స్థానిక డాక్టర్ వైయస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆదివారం మాస్టర్ కిషోర్, కిషోర్ డ్యాన్స్ అకాడమీ, కడప వారి శిష్య బృందంచే జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ కిషోర్, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



చివరి ఆయకట్టుకు నీరు కలేనా..!

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ఛానల్ పరిధిలోని కెసి చివరి ఆయకట్టుకు నీరు రావడం కలగా మారుతోంది. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేలా సిమెంట్ లైనింగ్ కాలువలు ఏర్పాటు చేసినా ఉపయోగం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఈ కాలువ పరిధిలో ఖాదర్‌పల్లె, చాపాడు, సీతారామపురం గ్రామాల పరిధిలో నాలుగు వందల ఎకరాలకుపైగా సాగు పొలం ఉంది. కాలువకు నీరు రాకపోవడంతో రైతులు ఇతర ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఖాదర్‌పల్లి, చాపాడు గ్రామాల్లో ఉన్న కెసి కాలువలో ఇళ్లల్లోని వ్యర్థనీరు అనుసంధానం చేయడం వల్ల కాలువ పూర్తిగా డ్రయినేజీతో నిండిపోయింది. ఈ నేపథ్యంలో కెసి నీరు కాలువలో ప్రవహించే అవకాశం లేకుండా పోయింది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. డ్రయినేజీని తొలగించి కాలువలో పూడికతీత పనులు చేపడితే పొలాలకు సాగు నీరు అందే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. కెసి కాలువ లైనింగ్ ఏర్పాటు చేసినా కాలువ పూర్తిగా గ్రామం మధ్యలో ఉండడంతో ప్రజలు ఇష్టానుసారంగా డ్రయినేజీగా ఉపయోగిస్తున్నారు. దీంతో పూడికతీత పనులకు ఉపాధి కూలీలు పూడికతీతకు అయిష్టత చూపు తున్నారు. కొన్నేళ్లుగా కాలువ అలాగే ఉంది. పంచాయతీ సిబ్బంది ఇళ్లల్లోంచి వచ్చే వ్యర్థ నీటిని కాలువలోకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మురుగు నీరు కాలువలోకి రాకుండా చర్యలు తీసుకుని అనంతరం పూడికతీత చేపడితే పంట కాలువ ఉపయోగంలోకి వస్తుంది. లేదంటే ఈ పంట కాలువ పూర్తిగా మురుగు కాలువగా మారే ప్రమాదం ఉంది.


చాపాడులోని పంట కాలువలో ప్రవహిస్తున్న మురుగు నీరు



మాట్లాడుతున్న విద్యార్థి

మంచి రచయితలుగా రాణించాలి

ప్రొద్దుటూరు : నేటి విద్యార్థులు భవిష్యత్తులో మంచి రచయితలుగా రాణించాలని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డి.కె.చదువులబాబు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా కేంద్రంలో విద్యార్థులకు కథారచన, పద్యపఠనం పోటీలు నిర్వహించారు. విద్యార్థుల విరామ సమయాన్ని సద్వినియోగపరచుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. యన్.గంగాధర్‌రెడ్డి విద్యార్థులతో జిరాఫిచెస్ ఆడించారు. స్పోకెన్ ఇంగ్లిష్ మాస్టర్ పవన్‌కల్యాణ్ విద్యార్థుల చేత ఇంగ్లిష్ కాన్వర్జేషన్‌ను సాధన చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తిరుపతమ్మ, హెల్పర్ నాగలక్ష్మిదేవి, చాడా మునిశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను అందించడమే 'శ్రీ రవీంద్ర' లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దేశానికి ఉత్తమ పౌరులను అందించి.. తద్వారా పుట్టిన గడ్డకు మంచి పేరు తేవడమే 'శ్రీరవీంద్ర' విద్యాసంస్థల లక్ష్యమని ఆ విద్యాసంస్థల అధ్యక్షులు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల గురించి ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. తను ఒక ప్రయివేట్ విద్యాసంస్థలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ 1997లో శ్రీరవీంద్ర విద్యాసంస్థలను ప్రారంభించానన్నారు. అనంతరం తనకు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చినప్పటికీ కొంతకాలానికి రాజీనామా చేసి విద్యాసంస్థల్నే కొనసాగించానన్నారు. తమ శిష్యుల్లో ఇరువురు గ్రూప్-1 అధికారులుగా ఉన్నారన్నారు. నాగేంద్ర ఖమ్మం జిల్లాలో జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్నారని, కీర్తన అను విద్యార్థిని మున్సిపల్ కమిషనర్‌గా శిక్షణలో ఉన్నారన్నారు. వీరితోపాటు 15 మంది డాక్టర్లుగా, 18మంది సిఎలుగా, ఇద్దరు ఎస్ఐలుగా విధులు నిర్వహిస్తు న్నారన్నారు. సతీష్ కుమార్‌రెడ్డి అను అబ్బాయి పరుగుపందెంలో రాష్ట్రస్థాయిలో రాణించారన్నారు. 2015-16 విద్యాసంవత్సరంలో మండలానికి 6 ప్రతిభా అవార్డులు వస్తే, అందులో 4 అవార్డులు శ్రీరవీంద్ర ఉన్నత పాఠశాలకు రావడం గర్వకారణమన్నారు. ఈ సారి ఫస్ట్ ఇంటర్‌లో తమ విద్యార్థి అరవింద్ 470కి 466 మార్కులు సాధించి స్టేట్‌ఫస్ట్ నిలిచారని, సెకండ్ ఇంటర్‌లో వైష్ణవి 1000 మార్కులకు గానూ 989 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్‌గా నిలిచారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే భార్గవ్ అను ఫస్ట్ ఇంటర్ విద్యార్థి 470కి గానూ 464 మార్కులు సాధించి తెలంగాణా రాష్ట్రంలో 3వ ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. తమ విద్యాసంస్థల ద్వారా 40 మంది ఉపాధ్యాయులకు ఉపాధి కల్పించడంతోపాటు 13మంది నాన్-టీచింగ్ స్టాఫ్ ఉన్నారన్నారు. మిగిలిన తరగతుల్లాగానే పదవ తరగతి విద్యార్థులకు కూడా తర్ఫీదు ఇస్తామన్నారు. ఏ ఒక్క విద్యార్థిపై కూడా వత్తిడి ఉండదన్నారు. వత్తిడికి దూరంగా.. ఉల్లాసంగా విద్యాభ్యాసం కొనసాగుతుందన్నారు. మూల విద్యావిధానం (బేసిక్ ఎడ్యుకేషన్) బాగుండాలన్నారు. పరీక్షల జవాబు పత్రాలు ప్రతి విద్యార్థి ద్వారా వారి తల్లిదండ్రులకు చేరవేస్తామని వివరించారు. ఉపాధ్యాయులు వేసే ప్రతి మార్కుకు విద్యార్థి అర్హుడై ఉండాలన్నారు. తమ పాఠశాలలో ప్రతి సోమవారం నైతిక విలువలు, ప్రతి మంగళవారం దేశభక్తి, ప్రతి శుక్రవారం ఆరోగ్య విషయాలు, ప్రతి శనివారం కేవలం విద్యార్థులకు అవసరమైన విజ్ఞానవంతమైన విషయాల గురించి వివరిస్తామన్నారు. విద్యా సంబంధించిన కవితలు, పాటలు రాయడం తన హాబీగా ప్రభాకర్‌రెడ్డి చెప్పుకొచ్చారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో మనమంతా కలిసుండాలని పాటలు రాశారు. పర్యావరణ పరిరక్షణపై 2018లో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి, మాజీ ఎంఎల్‌సి వెన్నపూస గోపాల్‌రెడ్డి సమక్షంలో తమ పాఠశాలకు చెందిన 1111 మంది విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుందన్నారు. ఇందుకు భారత్ బుక్ ఆఫ్ రికార్డు, ఆంధ్ర బుక్ ఆఫ్ రికార్డులు వచ్చాయన్నారు. 1995లో కడప జిల్లాకు 198 అదనపు ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపునకు ఆరు రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేశానని, అప్పట్లో తనకు జిల్లాలోని పది నియోజకవర్గాల నుండి ఉపాధ్యాయుల మద్దతు లభించిందని, ఫలితాన్ని సాధించామన్నారు. ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు అమ్మఒడి వచ్చే విషయంలో తాను కీలకపాత్ర పోషించానని, ప్రభుత్వంలోని సంబంధితులందరినీ కలిసి చర్చించామని పేర్కొన్నారు. విద్యా సంబంధిత విషయాలపై ప్రభాకర్‌రెడ్డి చేసిన కృషి ఫలితంగా 'ఉపాధ్యాయ రత్న, అబ్దుల్ కలామ్ అవార్డు, విద్యాభూషణ్ అవార్డు, టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డు, బెస్ట్ హ్యూమనిస్ట్ అవార్డు, సప్తగిరి అవార్డులు లభించాయి. కడప జిల్లా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం గౌరవాధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘానికి, స్వామి వివేకానంద సేవా సమితి, శ్రీ ప్రసన్న వేణుగోపాల మాధవ గో సంరక్షణశాలకు ఉపాధ్యక్షులుగా, రెడ్డిసేవా సంఘం కార్యవర్గసభ్యులుగా ప్రభాకర్‌రెడ్డి సేవలందిస్తున్నారు.



రవీంద్ర విద్యాసంస్థల భవనం


ఢిల్లీలో అక్కడి ఎమ్మెల్యేచే అబ్దుల్‌కలామ్ అవార్డు తీసుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)


ఆకట్టుకున్నవిద్యార్థుల నృత్య ప్రదర్శన (ఫైల్‌ఫోటో), (ఇన్‌సెట్) ఆరు అవార్డుల గ్రహీత పల్లేటి ప్రభాకర్‌రెడ్డి

కడప ఎంపీ స్థానం కాంగ్రెస్ గెలిచే అవకాశాలు

ప్రజాశక్తి - వేంపల్లె

కడప ఎంపీ స్థానం కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నట్లు పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి, రాష్ట్రంలో టిడిపి నేతృత్వంలో ఎన్‌డిఎ కూటమి కడప లోకసభ స్థానంలో షర్మిల గెలిచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో కేంద్రంలో ఏ పార్టీకి సొంతంగా అధికారంలోకి వచ్చేందుకు కావాల్సిన 272 సీట్లు రావని చెప్పారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం తప్పదని తెలిపారు. ఎన్‌డిఎ కూటమిలోని బిజెపియేతర పార్టీలతో పోలిస్తే ఇండియా వేదికలోని కాంగ్రెస్‌యేతర పార్టీలైన డిఎంకే, ఎస్పీ, తృణమూల్ కాంగ్రెసు, ఆర్జెడి బలమైన పార్టీలని చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా వేదిక కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో 2014 నాటి ఎన్నికల ఫలితాలు 2024లో పునరావృతం కావచ్చు అన్నారు. 2014లో టిడిపికి 102, జగన్ పార్టీ 67 వచ్చాయన్నారు. 2024లో కూడా టిడిపి కూటమి స్వల్ప మెజార్టీతో అధికారంలోకి వచ్చే అవకాశాలున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు శాతం పెరుగుతుందన్నారు.


ఎన్.తులసిరెడ్డి

ఏళ్లు గడుస్తున్నా.. చేపట్టని మరమ్మతులు

వృథా నీరంతా ఏడాది పొడవునా పొలాల్లోనే.. పట్టని ప్రాజెక్టు అధికారులు


దక్షిణ కాలువ ఎడమవైపు పడిపోయిన గోడ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఏళ్లు గడుస్తున్నా మైలవరం దక్షిణ కాలువ మరమ్మతులకు నోచుకోవడంలేదని కాలువ పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మైలవరం జలాశయం ఉత్తర, దక్షిణ కాలువలు జంబు, చెత్త చెదారంతో ఉన్నాయి. దక్షిణ కాలువ నర్సోజి కొట్టాల మొదలుకొని పొన్నతోట గూడెంచెర్వు, అంబవరం, అనంతగిరి, సున్నపురాళ్లపల్లి ఇలా ప్రతి గ్రామం వద్ద, చెరువుల వద్ద కాలువకు రంధ్రాలు వేశారు. ఇరువైపులా గోడలు పడిపోయాయి. కాలువకు నీరు వదిలినప్పుడు నీరంతా రంధ్రాల గుండా పొలాల్లోకి వెళ్లి ఏడాదంతా నీటిలోనే పొలాలు ఉన్నాయి. ఏడాది పొడవునా నీరు పారుతుండడంతో కొందరి భూములు జంబు, కంపచెట్లు పెరిగి ఉన్నాయి. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలువ కింది భాగం రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీరు తక్కువగా ఉంది. కాలువకు కూడా నీరు వదల్లేదు. ఈ పరిస్థితుల్లో పడిపోయిన గోడలు, రంధ్రాలు పడినచోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఉత్తర కాలువలో జంబు, చెత్తను కూడా తొలగించాలని కోరుతున్నారు.


కాలువలో పెరిగిన జంబు, పిచ్చిమొక్కలు


ప్రయివేట్ స్థలంలో ఏర్పాటైన ఎగ్జిబిషన్, దుకాణాలు (ఇన్‌సెట్) ముస్తాబైన దేవాలయం

ఆంక్షలు హుష్ కాకి.. నేడు రథోత్సవం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జమ్మలమడుగు నియోజకవర్గానికి ఒక గొప్ప పండగ. సుదూర ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి రావడంతో అక్కడ కోలాహలంగా మారుతుంది. ప్రతి ఏటాలాగే ఈ ఏడాది శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామికి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు టిటిడి అధికారులు నామమాత్రపు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 20వ తేదీ ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో శనివారం గరుడసేవతో మొదలుకొని సోమవారం రథోత్సవం, మంగళవారం ఊంజల్ సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. తిరుణాలల్లో భాగంగా ఆలయ ప్రాంగణ పరిధిలో ఎగ్జిబిషన్ సెంటర్లు, పలు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు టిటిడి నుంచి పర్యవేక్షణ అధికారులు వేలం పాట నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఆ నిధులను సమకూర్చేవారు. గతేడాది ఈ విధానం ద్వారా రూ.15.10 లక్షల ఆదాయం సమకూరిందని సమాచారం. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్, ఎలక్షన్ రోజు ఎమ్మెల్యేపై ఇటుకతో దాడి కారణంగా ఎగ్జిబిషన్, దుకాణాల ఏర్పాటుకు అధికారులు ఆంక్షలు తెలిపినట్లు టిటిడి పర్యవేక్షణ అధికారులు చెబుతున్నారు. టెండర్ల నిర్వహణ లేదు. వాటి నుంచి వచ్చే ఆదాయం స్వామివారికి గండి పడింది. అయితే కొంతమంది అధికార పార్టీ నేతలు పలుకుబడితో ఆలయం పక్కనే ప్రయివేట్ స్థలంలో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు చేయిస్తుండడంతో వారికి ఆదాయం సమకూరినట్లు తెలుస్తుంది. దీనితో అధికారులు ఆదేశాలు మరియు ఆంక్షలు ఊష్ కాకి అని జమ్మలమడుగు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఎన్నికల కోడ్ ప్రభావం వేంకటేశ్వరస్వామికి తగలడంతో జమ్మలమడుగులో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టిటిడి ఆధ్వర్యంలో శ్రీ నారాపురవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని అనుకున్నా.. అధికారుల నిర్లక్ష్యం ఎక్కువగా కనుబడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల కార్యాక్రమాలకు కూడా అధికారులు లడ్డు ప్రసాదాన్ని తెప్పించలేకపోవడంతో భక్తుల నిరాశ చెందుతున్నారు. సోమవారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఆ మేరకు రథాన్ని సిద్ధం చేశారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు.

క్రైం కార్నర్

తోటి యాచకురాలిని రాయితో కొట్టి హత్య

ప్రజాశక్తి - ముద్దనూరు

ముగ్గురు యాచకులు భిక్షాటన చేయగా వచ్చిన డబ్బులు కోసం మద్యం మత్తులో గొడవ పడి మహిళా యాచకురాలిని మిగతా ఇద్దరు యాచకులు (పురుషులు) రాయితో కొట్టి చంపిన ఘటన చోటుచేసుకుంది. ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావ్ తెలిపిన వివరాల ప్రకారం.. వేంపల్లెకు చెందిన చిన్ని (35), ధర్మవరానికి చెందిన గంగాధర్, ఆళ్లగడ్డకు చెందిన బాలపెద్దయ్య మూడు రోజుల క్రితం ముద్దనూరుకు వచ్చి భిక్షాటన చేసుకుంటూ.. పాత సామాన్లు ఏరుకుం టూన్నారు. ముగ్గురు భిక్షాటన చేసుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం సేవించి రైల్వేస్టేషన్‌లో ఉంటారు. శనివారం రాత్రి రైల్వేస్టేషన్‌లో నిరుపయోగంగా ఉన్న ఒక గదిలో ముగ్గురు యాచకులు భిక్షాటన చేయగా వచ్చిన సొమ్ము కోసం గొడవ చోటుచేసుకోగా.. గంగాధర్, బాలపెద్దయ్య చిన్నిని రాయితో కొట్టి చం పారు. ఆమె తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వేస్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.


హత్యకు గురైన యాచకురాలు చిన్ని

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ముద్దనూరు : భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని భర్త ఆరెడ్డిపల్లె ఓబులేసు (41) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పులూరు గ్రామానికి చెందిన ఓబులేసుకు అదే గ్రామానికి చెందిన చెన్నకేశవమ్మతో 20 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి కొడుకు, కూతురు ఉన్నారు. ఇటీవల ఓబులేసుకు తన భార్య కేశవమ్మ ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. మనస్తాపం చెంది ఆదివారం సాయంత్రం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న పెద్ద ఓబులేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు.


ఆత్మహత్య చేసుకున్న ఓబులేసు

విద్యుదాఘాతంతో బాలిక మృతి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ముత్తుకూరు గ్రామంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో ఇందుకూరి బ్రహ్మణి(11) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎర్రన్న కుమార్తె బ్రహ్మణి ఆదివారం ఉతికిన బట్టలను ఆరవేస్తుండగా విద్యుత్ లైన్ తగిలి బాలిక మృతి చెందినట్లు తెలిపారు. బ్రహ్మణి మృతితో ముత్తుకూరు ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలిక తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బ్రహ్మణి (ఫైల్‌ఫోటో)